క్లుప్తంగా

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



పాటిపల్లిలో కుళాయిల ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

మునగపాక: పాటిపల్లి పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని సర్పంచ్ ఆడారి కృష్ణవేణి తెలిపారు. మండలంలోని పాటిపల్లిలో కుళాయిల ఏర్పాటుకు గురువారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో పాటిపల్లి పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్‌ను సర్పంచ్, ఇతర పాలకవర్గ సభ్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆడారి రామకృష్ణ, యల్లపు వెంకట్, ఆడారి లీల, గనిరెడ్డి గోవింద, పెద్దలు భీశెట్టి ధనశ్రీను, కొయిలాడ త్రిమూర్తులు, పైడయ్య, ఆడారి అప్పారావు, కొయిలాడ సత్యనారాయణ, లక్ష్మణరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దొంకాడను ముంచెత్తిన వరద



దొంకాడ గ్రామంలోకి చేరిన వరద నీరు

నక్కపల్లి: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కొండ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న దొంకాడ, దోసలపాడు, సీతానగరం, గుల్లిపాడు, జగన్నాథపురం తదితర గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. గురువారం ఉదయం నుంచి కురిసిన వర్షానికి పోలవరం కాలువకు ఆనుకుని ఉన్న దొంకాడ గ్రామంలోకి భారీగా వరదనీరు చేరింది. వీధుల్లోకి నీరు చేరడంతో గ్రామస్తులు రాకపోకలకు నానా అవస్థలు పడ్డారు. ఇళ్లల్లోకి కూడా వరద నీరు చేరడంతో బయటకు తోడేందుకు ఇబ్బంది పడ్డారు. పోలవరం కాలువ కూడా పూర్తిగా వర్షపు నీటితో నిండిపోయింది.

ఘనంగా మరిడిమాంబ పండగ



మరిడిమాంబను దర్శించుకుంటున్న గ్రామ యువకులు

యలమంచిలి రూరల్: జంపపాలెంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా స్థాయి చెడుగుడు పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ



యలమంచిలి ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

యలమంచిలి రూరల్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపు మేరకు యలమంచిలి మండలంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్టు గురువారం ఎంఈవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితమయ్యేలా చూడాలని, బోధనేతర పనులైన గూగుల్ షీట్లు పూరించడం, విద్యాశక్తి, జీఎస్టీ 2.0 ప్రచారం వంటి కార్యక్రమాలను శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేపట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎల్లయ్యబాబు, ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు మల్లిపాటి సత్యనారాయణ, చంద్రశేఖర్, కిషోర్ పాల్గొన్నారు.



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు వెళ్తున్న అభిమానులను నిలువరిస్తున్న పోలీసులు



వైఎస్ జగన్‌కు స్వాగతం పలికేందుకు జాతీయ రహదారిపై పరుగులు తీస్తున్న యువకులు

ఆంక్షలు అధిగమించి..

జన జాతర

- మాజీ సీఎం వైఎస్ జగన్‌కు అడుగడుగునా నీరాజనం
- కూడళ్ల వద్ద అభిమాన నేత కోసం ఎదురుచూపులు
- ఎక్కడికక్కడ జనాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం, పోలీసుల విఫలయత్నం

నక్కపల్లి: జననేత వైఎస్ జగన్ కోసం జనం పరుగులు తీశారు. కార్యకర్తల ధైర్యం ముందు పోలీసుల కుట్రలు ఫలించలేదు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు పార్టీ శ్రేణులు ఎవరూ వెళ్లకుండా పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. తమకు అనువుగా ఉన్న రహదారుల మీదుగా గమ్యం చేరుకున్నారు. పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా కార్యకర్తలు మాత్రం మొక్కవోని ధైర్యంతో జననేత జగన్‌ను చూసేందుకు తరలివెళ్లారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన పోరుకు పాయకరావుపేట నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో జనం మాకవరపాలేనికి తరలివెళ్లారు. నక్కపల్లి మండలం నుంచి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. జగన్ పర్యటనకు, రోడ్‌షోకు అనుమతి లేదని, నక్కపల్లి నుంచి జనసమీకరణ చేయడానికి వీల్లేదంటూ మూడు రోజుల ముందే పోలీసులు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణకు ముందస్తు నోటీసులు అందజేశారు. అయినా వెరవని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి ఆధ్వర్యంలో వందలాది మంది మోటారు సైకిళ్లపై వివిధ మార్గాల్లో తాళ్లపాలెం, నర్సీపట్నం చేరుకున్నారు. ప్రధాన మార్గాల్లో పోలీసులు ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టి ఆటోల్లోను, ద్విచక్ర వాహనాల్లోను వెళ్లేవారిని అడ్డుకోవడం, తనిఖీలు చేయడం ఎక్కడకు వెళ్తున్నారని ప్రశ్నించడం, జగన్ పర్యటనకు అని చెప్తే వెనక్కి పంపేయడం వంటి చర్యలు తీసుకున్నప్పటికీ నాయకులు, కార్యకర్తలు మాత్రం తగ్గేదేలే అంటూ తమ అధినేతను చూసేందుకు తాళ్లపాలెం, నర్సీపట్నం చేరుకున్నారు. రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయడానికి వీల్లేదంటూ దీక్ష చేస్తున్న మత్స్యకారులు సైతం పోలీసుల ఆంక్షలను బేఖాతర్ చేస్తూ వివిధ మార్గాల ద్వారా మాకవరపాలెం సమీపంలోకి చేరుకుని 'బల్క్ డ్రగ్ పార్క్ వద్దు.. రాజయ్యపేట ముద్దు' అంటూ ప్లకార్డులను పట్టుకుని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. బల్క్ డ్రగ్ పార్క్ వ్యవహారంపై జగన్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతి లేదంటూ జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా సైతం నాయకులకు స్పష్టం చేశారు. వినతి పత్రం మాత్రమే ఇస్తామని ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని నాయకులు ఎస్పీకి వివరించారు. ఎట్టకేలకు నాయకులు మత్స్యకారుల సమస్యను జగన్‌కు వివరించారు. రాజయ్యపేట, బోయపాడు, చినతీనార్ల, పెదతీనార్ల, డీఎల్‌పురం, అమలాపురం దొండవాక తదితర గ్రామాల నుంచి జనం తరలివెళ్లారు. జగన్ పర్యటనలో పాల్గొన్న వారిలో మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు కంబాల సందీప్, పాడగట్ల పాపారావు, సూరాకాసుల గోవిందు, గొర్ల బాబూరావు, ఎరిపల్లి నాగేశ, ఎరిపల్లి ముసలయ్య, తాతబాబు, చంద్రరావు, నర్సింహమూర్తి, పిక్కి తాతీలు, భార్గవ్, గొర్ల గోవిందు, తిరుపతిరావు పి.బాబ్జి, తదితరులు ఉన్నారు.



నగరం వద్ద అడ్డగించిన పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



వైఎస్ జగన్ రాక కోసం తాళ్లపాలెం సమీపంలో నిరీక్షిస్తున్న కంబాల జోగులు, వీసం, చెంగల



పాయకరావుపేట నుంచి రోడ్డు షోకు బయలుదేరి వెళ్తున్న చిక్కాల రామారావు, నాయకులు

కోటవురట్ల: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన పోరుకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో జనం మాకవరపాలేనికి తరలివెళ్లారు. మండలంలోని 25 పంచాయతీల నుంచి భారీ సంఖ్యలో జనం తరలివెళ్లారు. వారితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కదం తొక్కారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణరాజు, పార్టీ సీనియర్ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ, పార్టీ నాయకులు రాజగోపాలరాజు, విజయ్‌బాబు, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, అభిమానులు, కార్యకర్తలు తరలివెళ్లారు. అయితే పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించి జగన్ వద్దకు వెళ్లకుండా అడ్డుపడ్డారు. లింగాపురం జంక్షన్, ధర్మసాగరం జంక్షన్, నగరం వద్ద పోలీసులు భారీగా మోహరించి దారిన వెళ్లేవారిని అడ్డగించారు. దీంతో వివిధ పనులపై వెళ్లే సామాన్యులు సైతం ఇబ్బంది పడ్డారు. కోటవురట్ల, పాయకరావుపేట, కోటనందూరు మండలాలకు నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన జనాన్ని మాకవరపాలెం మండలం నగరం వద్ద ఎస్ఐ రమేష్ సిబ్బందితో కలిసి అడ్డగించారు. దాంతో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు వాగ్వాదానికి దిగారు. జై జగన్ అంటూ నినాదాలు మిన్నంటాయి. పోలీసులు అడ్డగించడంతో వేలాదిగా వచ్చిన జనం మామిడి తోటలు, గుట్టలు, దాటుకుని మరీ మాకవరపాలెం చేరుకున్నారు.

పాయకరావుపేట: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటనలో పాల్గొనేందుకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు ఆధ్వర్యంలో మండలంలోని 24 పంచాయతీల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివెళ్లారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, పాల్మన్‌పేట, గోపాలపట్నం, మంగవరం, మూసాహేబ్‌పేట సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, పన్నీరు బాబ్జి, వంగలపూడి రామారావు, గెడ్డమూరి నీటవేణి శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దేవవరపు రాజేష్ ఖన్నా, ఎంపీటీసీలు యాగదాసు శేఖర్, పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి యజ్జల అన్నవరం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బోడపాటి గోవిందు, నాయకులు పెనుమత్స నాగేశ్వరరావు, కోనే పుత్రరావు, నీలాపు బాలకృష్ణరెడ్డి, దేవవరపు నాగభూషణం, తదితరులు బైక్‌లపై ర్యాలీగా వెళ్లారు.

ఎస్.రాయవరం: మాజీ సీఎం జగన్‌ను చూసేందుకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తాళ్లపాలెం జంక్షన్‌కు తరలివెళ్లారు. మండలం నుంచి తరలివెళ్లిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు మధువర్మ, ఉపాధ్యక్షులు వెదుళ్ల బంగారి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, కార్యకర్తలు, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పెదపాడు వద్ద జనాన్ని అడ్డగించిన పోలీసులు



వెదురువాడ నుంచి బయలుదేరిన నాయకులు



ఉమ్మలాడ జంక్షన్ వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఉప్పొంగిన అభిమానం

యలమంచిలి రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా ఆయనను చూసేందుకు వెళ్తున్న వారందరికీ గురువారం అడుగడుగునా పోలీసుల ఆంక్షలు పెట్టారు. యలమంచిలి, కశింకోట, ఎస్.రాయవరం, నక్కపల్లి, రాంబిల్లి, మునగపాక తదితర మండలాల్లో ఎక్కడికక్కడ రహదారులపై పోలీసుల ఆంక్షలతో వైఎస్ జగన్‌ను చూసేందుకు ప్రజలు, పార్టీ కార్యకర్తలను వెళ్లకుండా కూటమి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించింది. ఎన్ని అడ్డంకులు పెట్టినా జననేతను చూసేందుకు వేల సంఖ్యలో తాళ్లపాలెం కూడలికి జనం చేరుకోవడంతో పోలీసులే ఆశ్చర్యపోయారు. అయినప్పటికీ తాళ్లపాలెం కూడలికి భారీగా చేరుకున్న జనాన్ని రోడ్లపైకి రాకుండా పోలీసులు నిలువరించేందుకు యత్నించారు. విసుగుచెందిన జనం, పార్టీ శ్రేణులు బారికేడ్లు దాటుకుని 16వ నెంబరు జాతీయ రహదారిపైకి పరుగులు తీశారు. దీంతో పోలీసులు చేసేదేమీ లేక పక్కకు తప్పుకోవాల్సి వచ్చింది. అంతకు ముందు ఉదయం నుంచీ తాళ్లపాలెం కూడలి వద్ద పోలీసులు తీవ్రమైన ఆంక్షలు విధించారు. మందుల దుకాణాలు తప్ప మిగిలిన వాటిని మూసివేయించారు. తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వైపునకు వెళ్లే అన్ని వాహనాలను అడ్డుకోవడంతో మహిళలు,అత్యవసర పనులపై వెళ్లే సామాన్య పౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జగనన్న తాళ్లపాలెం రావడానికి అర్ధగంట ముందు కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షంలో తడిసిపోతూనే యువత, వృద్ధులు, మహిళలు సైతం రహదారిపై నుంచి కదలకుండా తమ అభిమాన నేతను కళ్లారా చూసేందుకు నిలబడిపోయారు. అక్కడకు చేరుకున్న వైఎస్ జగన్‌ను చూసి పరవశించిపోయారు. తన కోసం భారీ వర్షంలో ఎదురు చూస్తున్న జనాన్ని చూసిన వైఎస్ జగన్ వర్షంలోనే అందరికీ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.

రాంబిల్లి(అచ్యుతాపురం): వైద్య కళాశాల సందర్శనకు వచ్చిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు రాంబిల్లి మండలం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. అధినేత పర్యటనతోనే పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. రాంబిల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన కార్యకర్తలు అనకాపల్లి మండలంలోని కొత్తూరు, కశింకోట మండలంలోని తాళ్లపాలెం జంక్షన్‌కు చేరుకుని జై జగన్ అంటూ నినాదాలు చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కొత్తూరు జంక్షన్ నుంచి తాళ్లపాలెం జంక్షన్ వరకూ తరలివెళ్లారు. అక్కడి నుంచి కొందరు నర్సీపట్నం మెడికల్ కాలేజీ వరకూ జగన్ వెంట ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంపీపీ శిరీషా శ్రీనుబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కిశోర్, ప్రచార కమిటీ అధ్యక్షుడు కొవిరి రామకృష్ణ, ధూళి వెంకీ, పాల్గొన్నారు.

ఉమ్మలాడ జంక్షన్ వద్ద జగన్ అభివాదం

మునగపాక: నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెంలో మెడికల్ కళాశాల సందర్శనకు రోడ్డు మార్గంలో వెళ్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఉమ్మలాడ వద్ద పలువురు నాయకులు ఘన స్వాగతం పలికారు. మునగపాక మండలం ఉమ్మలాడ జంక్షన్ వద్ద ఎదురుచూస్తున్న వందలాది కార్యకర్తలు, ప్రజలకు వైఎస్ జగన్ తన వాహనం నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. దీంతో పార్టీ శ్రేణులు జై జగన్.. అంటూ నినదించారు. దారులన్నీ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులతో కిటకిటలాడాయి.



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాక కోసం ఉమ్మలాడ వద్ద ఎదురుచూస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నాగులాపల్లి వద్ద స్టాపర్లను ఏర్పాటు చేసిన మునగపాక పోలీసులు



రాంబిల్లి మండలం నుంచి తరలిన వైఎస్సార్‌సీపీ నాయకులు

అడుగడుగునా ఆంక్షలు

మునగపాక: మెడికల్ కళాశాలను సందర్శించేందుకు వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతం కాకుండా ఉండేలా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు పలు చోట్ల స్టాపర్లు ఏర్పాటు చేశారు. మునగపాక మండలం నాగులాపల్లి, తోటాడ–మూలపేట జంక్షన్, గణపర్తి బ్రిడ్జి వంటి ప్రాంతాల్లో పోలీసులు పెద్ద సంఖ్యలో స్టాపర్లు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న కార్యకర్తలు పోలీసుల కుట్రలను ఛేదించి జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉదయం నుంచి ఉత్సాహంగా అధినేతకు ఘన స్వాగతం పలికేందుకు తరలిరావడంతో ఒక్కసారిగా పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపించింది.

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని మళ్లవరం, నరేంద్రపురం, వెదురువాడ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనకు తరలివెళ్లారు. దారి మధ్యలో పెదపాడు వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డంకులు కలిగించినా, వర్షం పడుతున్నా తరలివెళ్లి జననేత జగనన్నకు మద్దతు తెలిపారు. ఉచిత విద్యా, వైద్యం కోసం పోరాడుతున్న వైఎస్ జగన్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు.



మళ్లవరం నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు

తల్లిదండ్రుల చెంతకు అదృశ్యమైన బాలిక

నక్కపల్లి: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల నుంచి అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ తెలిసింది. ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న మాకవరపాలెం మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన రామతులసి మంగళవారం రాత్రి పాఠశాల గోడ దూకి వెళ్లిపోయింది. దీనిపై పాఠశాల సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విచారణ చేపట్టిన పోలీసులు.. రామతులసి అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. హాస్టల్‌లో ఉండి చదవడం ఇష్టం లేక రామతులసి వెళ్లిపోయినట్లు తమ విచారణలో వెల్లడైందని ఎస్ఐ తెలిపారు. గురువారం బాలికను తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బందికి అప్పగించారు.



విద్యార్థినిని తల్లిదండ్రులకు, ప్రిన్సిపాల్‌కు అప్పగిస్తున్న పోలీసులు

వైఎస్ జగన్ దృష్టికి 'పూడిమడక' బాధితుల సమస్య

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డికి వినతిపత్రం అందించేందుకు నిర్వాసితులు గురువారం జాతీయ రహదారిపై నిరీక్షించారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు 14 కిలోమీటర్ల మేర రహదారిని అభివృద్ధి చేసే క్రమంలో బాధితులకు పరిహారాన్ని నేరుగా అకౌంట్‌లో జమ చేయాలంటూ పలువురు బాధితులు డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీలో భాగంగా టీడీఆర్‌లు ఇవ్వకుండా నేరుగా నగదు అకౌంట్‌లో జమ అయ్యేలా చూడాలని కోరుతూ వినతిపత్రాన్ని ధర్మశ్రీ ద్వారా వైఎస్ జగన్‌కు అందజేసినట్లు నిర్వాసితుడు అచ్చియ్యనాయుడు తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ ఆధ్వర్యంలో టీడీఆర్ బాండ్లు వద్దంటూ నినదిస్తున్న నిర్వాసితులు

జీఎస్టీ సవరణతో ప్రయోజనాలు



పాయకరావుపేటలో మాట్లాడుతున్న జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ప్రసన్నకుమార్

పాయకరావుపేట: జీఎస్టీ సవరణతో పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతోందని జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ప్రసన్నకుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మందులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు జీఎస్టీ ఎంత తగ్గిందో అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు పి.జానుప్రసాద్, జి.వి.సత్యనారాయణ, ఎంపీహెచ్‌వో డి.నెహ్రూ, ఎం.నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మునగపాక పీహెచ్‌సీలో మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు

మునగపాక: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన నూతన జీఎస్టీ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు తెలిపారు. పీహెచ్‌సీ ఆవరణలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలు రకాల వస్తువుల ధరలు తగ్గడం ద్వారా పేదలకు మేలు జరుగుతుందన్నారు. సీహెచ్‌వో దేవకాంత, వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేవీ ప్రాజెక్టుతో ఇబ్బందులు.. కొత్తపేట గ్రామస్తుల వినతి

యలమంచిలి రూరల్: రాంబిల్లిలో చేపట్టిన నేవీ ప్రాజెక్టు కారణంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, హైకోర్టు ఆదేశించినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, తమకు న్యాయం జరిగేలా మద్దతునివ్వాలని కోరుతూ రాంబిల్లి మండలం కొత్తపేట గ్రామస్తులు గురువారం తాళ్లపాలెం కూడలి వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామ సర్పంచ్ వీవీఏ లత ఆధ్వర్యంలో పలువురు ప్లకార్డులు చూపి కూటమి ప్రభుత్వం తమకు చేస్తున్న అన్యాయాన్ని వివరించారు. రాంబిల్లి ఎన్ఏవోబీ నిర్మాణం వల్ల ఇక్కడ పలు గ్రామాల ప్రజల జీవితాలు ప్రభావితమయ్యాయని, గతంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రభుత్వానికి ఇచ్చిన సిఫార్సులను అమలు చేయకపోవడంతో హైకోర్టులో వ్యాజ్యం వేయడంతో న్యాయస్థానం తమకు న్యాయం చేయాలని ఆదేశించి 30 రోజులు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. రాంబిల్లి మండలంలో కొత్తపేట, కొప్పుగుండుపాలెం, వై.లోవ, పెదకలవలాపల్లి, నేవీ కాలనీ, చిన కలవలాపల్లి, గోవిందపాలెం, వాడ రాంబిల్లి, నర్సాపురం గ్రామాలు నేవీ ప్రాజెక్టు నిర్మాణంతో సతమతమవుతున్నాయన్నారు. వీరికి రాంబిల్లి జెడ్పీటీసీ ధూళి నాగరాజు మద్దతు తెలిపారు.



ప్లకార్డులు చూపుతూ తమకు న్యాయం చేయాలని కోరుతున్న రాంబిల్లి మండలం కొత్తపేట గ్రామస్తులు